

ప్రజాప్రభుత్వం ప్రజలకోసం పనిచేస్తుంది

రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు.

- 8లో ▸



పుష్కర స్నానం.. పుణ్యఫలం

పుష్కర స్నానం చేయడం ద్వారా జీవన గమనంలో చేసిన పాపాలు తొలగిపోతాయని పురాణాల్లో పేర్కొనబడింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం $36^0/27^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతోపాటు వడగాలులు వీస్తాయి. రాత్రిపూట ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిర్లక్ష్యం వహిస్తే సహించం



బచ్చన్నపేట: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని తొందరగా మిల్లులకు తరలించాలని.. నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. మండలంలోని కొడవటూర్, ఆలింపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ.. రైతుల ధాన్యం తేమ శాతం రాగానే తూకం వేసి, మిల్లులకు తరలించాలని అన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతుల ధాన్యం తడిసి చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గన్నీ బ్యాగులు సరిపడా లేకున్నా, లారీలు రాకున్నా తెలియజేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడుతామన్నారు. మిల్లర్లు రైతుల ధాన్యంపై కొర్రీలు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలింపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసి మూడు రోజులు అవుతున్నా.. లారీలు రావడంలేదని రైతులు ఆయనకు తెలియజేయడంతో వెంటనే లారీ యాజమాన్యంతో మాట్లాడి లారీని పంపించాలని చెప్పారు. తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంఆర్‌ఐ వంశీకృష్ణ, సీసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను పెంచాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను పెంచేదిశగా వైద్య, ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మల్లికార్జునరావు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, మల్కాపూర్, ఇప్పగూడెం, తాటికొండ పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలతో స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను పెంచేలా అందరూ బాధ్యతగా పనిచేయాలని అన్నారు. ప్రతినెలలో సీహెచ్‌సీ పరిధిలో కనీసం యాభై సాధారణ ప్రసవాలను చేపట్టాలన్నారు. ఇద్దరు పిల్లలతో కుటుంబ నియంత్రణ చేసుకునేలా ప్రజలను చైతన్యం చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలపై ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజరీ స్టాఫ్ ప్రజలకు వివరించాలన్నారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వీరాంజనేయులు, మాతా, శిశు సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ రవీందర్‌గౌడ్, ఘన్‌పూర్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్య, డాక్టర్లు సునీత, రుబీనా, ప్రణీత, జ్యోతి, కుషాలి, శ్రావన్, అజయ్‌కుమార్, సీహెచ్‌ఓ వెంకటస్వామి, ప్రభాకర్ పాల్గొన్నారు.

అసోసియేషన్ ఎన్నిక



జనగామ: జనగామ జిల్లా ఫర్టిలైజర్స్ ఫెస్టిసైడ్స్, సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలను పట్టణంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫర్టిలైజర్ సీడ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరీశెట్టి మునిందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జూరి రవీందర్ హాజరయ్యారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పజ్జూరి గోపయ్య, ప్రధాన కార్యదర్శిగా సదానందం, కోశాధికారి కాసర్ల రవీందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మునిందర్ మాట్లాడుతూ.. సీడ్స్ లైసెన్స్ రెండు సంవత్సరాల కాలపరిమితి నుంచి మూడేళ్లకు పెంపు, ఫెస్టిసైడ్స్ లైసెన్స్‌కు సంబంధించి రెగ్యులర్‌గా ఉండే విధంగా ఆల్ ఇండియా అసోసియేషన్ భాగస్వామ్యంతో కలిసి భారత ప్రభుత్వాన్ని ఒప్పించి హక్కులను సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో గూడెల్లి మధుసూదన్‌రెడ్డి, నడిపెల్లి సీతారాంరెడ్డి, ధనుంజయ, మహేష్, సురేందర్ ఉన్నారు.


అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

జనగామ: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జనగామ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం అర్హులకు మాత్రమే పథకాలు అందిస్తోందన్నారు. సంక్షేమ పథకాలు అందుకున్నవారు వినియోగించుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ రాజకీయలకు అతీతంగా, అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనను పార్టీ కేడర్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు అవినీతికి పాల్పడినా పార్టీ నుంచి సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు.

చారిత్రక నేపథ్యం.. అందానికి ఆతిథ్యం

ఓరుగల్లుకు నేడు 'ప్రపంచ సుందరీమణులు'

- వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట సందర్శన
- రామప్పలో సందడి చేయనున్న అందాలభామలు
- అడుగడుగునా సీసీ కెమెరాల నిఘా.. 3వేల మందికి పైగా పోలీసులు
- మూడంచెల భద్రత.. సీనియర్ అధికారుల పర్యవేక్షణ



పున్నమి వెలుగుల్లో రామప్ప

సాక్షిప్రతినిధి, వరంగల్/వెంకటాపురం(ఎం): చారిత్రక నేపథ్యమున్న ఓరుగల్లులో వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు బుధవారం సందడి చేయనున్నారు. కళలు, దేవాలయాలు, చారిత్రక కట్టడాలు.. సాంస్కృతిక వేదికలు.. సంస్కృతీసంప్రదాయాలకు పెద్దపీట వేసిన కాకతీయుల కాలంనాటి కట్టడాలను తిలకించనున్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు రెండు బృందాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు రానున్నారు. ఈ మేరకు వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్పలో సకల ఏర్పాట్లు చేశారు. ఐదు రోజులుగా హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. రామప్పలో ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ శబరీష్ రెవెన్యూ, పర్యాటక తదితర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులు చేయించారు.

ముస్తాబైన నగరం..

వరంగల్ నగరంలో మూడుచోట్ల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. వేయిస్తంభాల దేవాలయం, ఫోర్ట్ వరంగల్ వద్ద సౌండ్ అండ్ లైట్, ఫ్లియా మార్కెట్, సాంస్కృతిక ప్రదర్శనల వేదిక, మీడియా పాయింట్లు ఏర్పాటు చేశారు. హరిత కాకతీయ, వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, పలు ముఖ్య కూడళ్ల ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జిగేల్‌మంటున్నాయి. సుందరీమణుల పర్యటనను పర్యవేక్షించేందుకు వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో ప్రస్తుతమున్న సీసీ కెమెరాలతోపాటు అదనంగా మరికొన్ని అమర్చారు. మూడంచెల భద్రత కోసం కమిషనరేట్ పరిధిలో సుమారు రెండు వేల మందికిపైగా పోలీసులను వినియోగిస్తున్నారు. హరిత హోటల్ చుట్టూ 200 మంది సిబ్బంది పహారా కాస్తున్నారు.

4.35 గంటలకు వరంగల్‌కు..

- హైదరాబాద్ నుంచి రెండు బృందాలుగా ప్రత్యేక బస్సుల్లో బయలుదేరుతారు.
- ఒక బృందం హనుమకొండలోని హరిత కాకతీయకు సాయంత్రం 4.35 గంటలకు చేరుకుంటుంది.
- సుమారు గంటపాటు హోటల్‌లోనే గడిపి సాయంత్రం 5.45 గంటలకు వేయిస్తంభాల గుడికి చేరుకుంటారు.
- 40 నిమిషాలు పాటు అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.
- సాయంత్రం 6.25 వరంగల్ కోటకు చేరుకుంటారు. 7.30 గంటలకు వరకు అక్కడే పేరిణి శివతాండవం, ఇతర సంప్రదాయ నృత్యాలను తిలకించి తిరిగి హరిత హోటల్‌కు చేరుకుంటారు.
- 8 గంటల నుంచి 9 గంటల వరకు పర్యాటక శాఖ విందులో పాల్గొని 9.15 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతారు.



విద్యుత్ వెలుగుల్లో వేయిస్తంభాల గుడి





కోటలో మంగళవారం రాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద, కమిషనర్ వాకడే, మేయర్ సుధారాణి

అందాల భామలకు ఆహ్వానం

సుందరీమణుల రాక సందర్భంగా రామప్ప ఆలయం జిగేల్‌మంటోంది. విదేశీ వనితలు భారతీయ సంప్రదాయాలను గౌరవిస్తూ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆలయం చుట్టూ గ్రీన్ మ్యాట్ వేశారు. ప్రత్యేక విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం గార్డెన్‌లో స్టేజీ నిర్మించారు. సరస్సు కట్టపై ఉన్న హరిత కాటేజీలను ముస్తాబు చేశారు. వెయ్యి మంది సిబ్బందితో మూడంచెల భద్రత ఏర్పాటు చేసి మంగళవారం రాత్రి నుంచే పోలీసులు విధుల్లో చేరారు. పర్యాటకులకు బుధవారం రామప్ప సందర్శనకు అనుమతి లేదు.

రామప్ప ఆలయంలో ఇలా..

- 4గంటలకు రామప్పకు చేరుకుంటారు. 4:40 గంటలకు రామప్ప సరస్సు అందాల వద్ద ఫొటో సెషన్‌లో పాల్గొంటారు.
- 4:55 గంటలకు రామప్ప ఆలయానికి చేరుకుంటారు. 5 గంటలకు రామప్ప ఎంట్రెన్స్ గేట్ వద్ద కొమ్ముకోయ నృత్యంతో కళాకారులు వారికి స్వాగతం పలుకుతారు.
- 5:10 నుంచి 6 గంటల వరకు సంప్రదాయ దుస్తుల్లో రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని శిల్పకళాసంపదను తిలకిస్తారు.
- 6.10 గంటల నుంచి రాత్రి 7.00 గంటల వరకు రామప్ప గార్డెన్‌లో అలేఖ్య శాస్త్రీయ నృత్యం, పేరిణి ప్రదర్శన వీక్షించిన అనంతరం ప్రముఖులు అతిథులను సన్మానిస్తారు.
- రాత్రి 7.20 గంటలకు ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌కు చేరుకుంటారు. 7.30 గంటలకు డిన్నర్ చేసి 8:15 గంటలకు హైదరాబాద్ ప్రయాణమవుతారు.

ఏయే దేశాల సుందరీమణులంటే..

ప్రపంచంలోని 19 దేశాలకు చెందిన సుందరీమణులు గ్రేటర్ వరంగల్ నగరానికి, 32 దేశాల వారు రామప్ప ఆలయానికి రానున్నట్లు సమాచారం. వారిలో అర్జెంటీనా, బొలివియా, బ్రెజిల్, కెనడా, చీలి, కొలంబో, ఈక్వెడార్, ఈ సాల్వడార్, గౌతమాల, మెక్సికో, పనామా, పరాగ్వే, పెరు, యునైటెడ్ స్టేట్స్, వెనిజులా, హైతీ, హోండురాస్, నికరగ్వా, సురినామే తదితర దేశాల సుందరీమణులు ఉన్నారు.

డిన్నర్‌లో ఇవే..

సుందరీమణులకు హనుమకొండ నక్కలగుట్టలోని టూరిజం హోటల్ హరిత కాకతీయ ముస్తాబైంది. హోటల్‌కు చేరుకున్న బృందానికి స్వాగత పలకరింపుగా నారింజ జ్యూస్ అందిస్తారు. స్టాటర్‌గా ప్రెలూడే ప్లేట్-స్టార్టర్ ట్రియో, గోల్డెన్ కోస్ట్ ఫిష్ బైట్స్ లేదా చీజ్ అండ్ హెర్బ్ మిలాంజ్ క్రాక్వెట్స్, సీసర్స్ గార్డెన్, మెయిన్ అఫెయిర్- సిగ్నేచర్ ప్లేట్స్‌గా నాన్ వెజిటేరియన్‌గా హర్బ్ గ్రిల్డ్ చికెన్ సుప్రీం, వెజిటేరియన్‌గా గ్రిల్డ్ కాటేజ్ చీస్ స్టీక్, మెడిటెర్రానీన్ వెజిటబుల్ గ్రాటిన్, టస్కాన్ పెన్నె అర్రాబిటా, గోల్డెన్ చిప్స్, స్వీట్ ఇంప్రెషన్‌గా చాక్‌లెట్ మౌసెస్, సాఫ్రాన్ ఫిర్ని, సీసన్స్ బౌంటి అందిస్తారు.



ప్రశాంతంగా పాలీసెట్



సెయింట్ మేరీస్ పరీక్ష సెంటర్ వద్ద రూం నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు, అధికారులు

- 1,343 మంది విద్యార్థుల హాజరు..
- 73 మంది గైర్హాజరు
- పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు

జనగామ: టీజీ పాలీసెట్ -2025 ప్రవేశ పరీక్ష జిల్లాలో మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. పాలిటెక్నిక్(డిప్లొమా) కోర్సుల్లో అడ్మిషన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహించగా.. జిల్లాలో 1,416 మంది విద్యార్థుల కోసం మూడు సెంటర్లను ఏర్పాటు చేశారు. 1,343 మంది ప్రవేశ పరీక్షకు (94.84 శాతం) హాజరయ్యారు. 73 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ.నర్సయ్య వెల్లడించారు.

వివిధ కేంద్రాల్లో హాజరు శాతం..

జనగామ పట్టణంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లో 576 మంది విద్యార్థులకు 553 మంది (96 శాతం) హాజరుకాగా.. 23మంది గైర్హాజరయ్యారు. హైదరాబాద్ రోడ్డులోని సెయింట్ మెరీస్ హైస్కూల్ కేంద్రంలో 480 మందికి 450మంది (94 శాతం)హాజరుకాగా.. 30 మంది గైర్హాజరయ్యారు. స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో 360 మంది విద్యార్థులకు 340మంది (94.44శాతం) హాజరు కాగా.. 20 మంది గైర్హాజరయ్యారు. మొత్తం పరీక్ష కేంద్రాల్లో బాలురకంటే బాలికలే ఎక్కువమంది పరీక్షకు హాజరయ్యారు.

9 గంటల నుంచి లోనికి అనుమతి

పాలీసెట్ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచే సెంటర్ల వద్దకు విద్యార్థుల రాక ప్రారంభమైంది. 9 గంటల నుంచి అధికారులు పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. సెంటర్ల వద్ద డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తుతోపాటు 144 సెక్షన్ అమలు చేశారు. జిరాక్స్ సెంటర్లను మూసి వేశారు. అధికారులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే సెంటర్‌లోకి పంపించారు. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. నిమిషం నిబంధన అమలు చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్ష ప్రశాంతంగా ముగియగా, పోలీసుల బందోబస్తు నడుమ పరీక్ష సామగ్రిని స్ట్రాంగ్ రూంకు తరలించారు.


వెరిఫికేషన్ వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ రూరల్: ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక పరిశీలన వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి అన్ని మండలాల స్పెషల్ అధికారులు మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ పీడీ, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు, ఎస్సీ కార్పొరేషన్, ఎల్‌డీఎం, ఎంపీడీఓలతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంత మందిని అర్హులుగా గుర్తించ్చారో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆధునిక పద్ధతులను పాటించాలి

రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచి గుణాత్మక, ఆధునిక విద్యనందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ, ఆదర్శ, తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ కొడకండ్ల, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులకు క్రీస్తు జ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజులపాటు నిర్వహించే జిల్లా స్థాయి వృత్యంతర శిక్షణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠ్యంశాల బోధనలో విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. శిక్షణ మెలుకువలను పాఠశాల స్థాయికి తీసుకెళ్లి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. పుస్తక పరిజ్ఞానంతో పాటు అధునాతన టెక్నాలజీకి తగ్గట్టు విద్యార్థుల మేథాశక్తిని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ భోజన్న, ఏఎంఓ శ్రీనివాస్ కోర్సు ఇంచార్జ్‌లు మల్లికార్జున్, యాదగిరి, ఆనంద్ బాబు పాల్గొన్నారు. అక్షరాస్యతలో అంతరాన్ని తగ్గించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో అక్షరాస్యతా కార్యక్రమం మీద తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ విద్యాశాఖల సంయుక్త సమావేశం నిర్వహించారు. చదువు రాని, మధ్యలో బడి మానేసిన వారి వివరాల సర్వే 19వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ నాగరాజు, మండల విద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

హరిత హోటల్ వద్ద భారీ భద్రత



హరిత హోటల్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం : ప్రపంచ సుందరీమణుల వరంగల్ పర్యటనలో భాగంగా హనుమకొండలో వారు బస చేసే హరిత హోటల్ చుట్టూ 200 మంది సిబ్బందితో భారీ భద్రత ఏర్పాటు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఎక్కడా, ఎలాంటి సమస్య తలెత్తకుండా హరిత హోటల్‌ను పూర్తి నిఘా నీడలో ఉంచనున్నట్లు తెలిపారు.

అండర్-25 క్రికెట్ జిల్లా జట్ల ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: ఈ నెల 15, 16వ తేదీల్లో అండర్-25 జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరుణాపురంలోని వంగపల్లి క్రికెట్ మైదానంలో వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాల స్థాయి ఎంపికలు ఉంటాయన్నారు. ఆరు జిల్లాల క్రికెట్ జట్ల ఎంపిక కోసం నిర్వహించే ఈ పోటీల్లో 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల క్రీడాకారులు, ఆగస్టు 31, 2000 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, మీసేవ జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం, యూనిఫాంతో వంగపల్లి గ్రౌండ్ వద్ద ఉదయం 10గంటల కల్లా హాజరు కావాలన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో ఆరు జిల్లాల జట్లు ఎంపిక చేసి ఈనెల 19వ తేదీన అంతర్‌జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్ డిస్ట్రిక్ట్స్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులతో కూడిన ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు జూన్ మొదటి వారం నుంచి హైదరాబాద్ కేంద్రంగా జరిగే లీగ్ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. వివరాలకు 98495 70979 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

వడదెబ్బతో జీపీ కార్మికుడి మృతి



రాజేందర్ (ఫైల్)

హసన్‌పర్తి: వడదెబ్బతో ఓ గ్రామ పంచాయతీ కార్మికుడు మృతిచెందాడు. ఈఘటన హసన్‌పర్తి మండలం సీతానాగారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాజేందర్ గ్రామ పంచాయతీలో పంప్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విధులకు హాజరైన రాజేందర్ వడదెబ్బతో అస్వస్థకు గురై అదే రోజు రాత్రి మృతి చెందాడు. కాగా, రాజేందర్ మృతదేహాన్ని కారోబార్, బిల్ కలెక్టర్ల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం, కార్యదర్శి వెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రజనీకుమార్ సందర్శించి నివాళులర్పించారు.

కోటలో ఏర్పాట్ల పరిశీలన..

ఖిలా వరంగల్: ప్రపంచ సుందరీమణుల రాకకు కోటలోని శిల్పాల ప్రాంగణాన్ని మంగళవారం రాత్రి కలెక్టర్ డాక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, పర్యాటక శాఖ రాష్ట్ర అధికారి నాథన్, కల్చరల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. రాత్రి వేళల్లో కోట మరింత సౌందర్యవంతంగా కనిపించేలా తీర్చిదిద్దిన లైటింగ్ ఏర్పాట్లను ఆసక్తిగా తిలకించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ప్రత్యేక స్వాగతం పలకనున్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ నందిరామ్ నాయక్, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పుష్కర స్నానం.. పుణ్య ఫలం

నది స్నానాలు ఆచరిస్తే పాపాలు హరణం

- 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీనది పుష్కరాలు
- 12 రోజులు దాన, ధర్మాలు



గోదావరి నదిలో స్నానం ఆచరిస్తున్న దంపతులు(ఫైల్)



వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు(ఫైల్)



పిండప్రదాన పూజలు నిర్వహిస్తున్న భక్తులు(ఫైల్)

12 రోజులు చేయాల్సిన దానాలు
1వ రోజు సువర్ణం, రజతం, ధాన్యం, భూదానం చేయాలి
2వ రోజు వస్త్ర, లవణ, రత్న దానం..
3వ రోజు బెల్లం, అశ్వశాఖ, ఫలదానం..
4వ రోజు నెయ్యి, తైలం, క్షీరం, తేనె దానం..
5వ రోజు ధాన్యం, శకట, వృషభ, హలం దానం..
6వ రోజు ఔషధం, కర్పూరం చందనం, కస్తూరి దానం..
7వ రోజు గృహం, పీట, శయ్యదానం..
8వ రోజు చందనం, కందమూలాలు, పుష్పమాల దానం..
9వ రోజు పిండం, దాసి, కన్యా, కంబళి దానం..
10వ రోజు కూరగాయలు, సాలగ్రామ, పుస్తక దానం..
11వ రోజు గజదానం..
12వ రోజు నువ్వులు దానం చేయాలి

కాళేశ్వరం: పుష్కర స్నానం.. ఎంతో పుణ్య ఫలం. నది స్నానాలు చేస్తే మానవ జీవన గమనంలో తెలిసో, తెలియకో చేసిన పాపాలు తొలగుతాయని పురాణాల్లో పేర్కొనబడింది. ఈ క్రమంలో ఈ నెల 15 (గురువారం) నుంచి 26వ తేదీ వరకు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని గోదావరి, ప్రాణహిత నదులు, అంతర్వాహిణి సరస్వతీనది పుష్కరాలు జరగనున్నాయి. బృహస్పతిలోకి మిథునరాశి ప్రవేశించినప్పుడు సరస్వతీనదికి పుష్కరం వస్తుంది. ఈ నేపథ్యంలో సరస్వతీనది పుష్కరాలను 12 రోజుల పాటు ఘనంగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి పుష్కరాల ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు.

జలమే ఆధారం..

సమస్త ప్రాణకోటి మనుగడకు జలం ఆధారం. జలం పుట్టిన తర్వాతే జీవకోటి ఉద్భవించింది. జలాధారాల వెంటనే మొదట నాగరికత విస్తరించింది. అలాంటి జలానికి దేవత రూపాలనిచ్చి తల్లిగా ఆరాధించడం హిందూ సంప్రదాయం. నది స్నానాలు, కోనేటి, సముద్ర, మాగ, మంగళ స్నానాలు హిందూసంప్రదాయంతో ముడిపడ్డాయి. అలాగే, తీర్థయాత్రలని, పుణ్యక్షేత్రాల దర్శనం కూడా నీటితో ముడిపడిందే. శ్రాద్ధ కర్మలు, పిండ ప్రదానాలు తర్పణాలు జలంతో ముడిపడ్డాయి. నది తీరంలో పితృకర్మలాచరించడం మోక్షదాయకమని పెద్దలు పేర్కొంటున్నారు. పితురులను ఉద్ధరించడానికి భగీరథుడు గంగానదిని భూమికి తీసుకొచ్చాడని పురాణాలు చెబుతున్నాయి.

పిండ ప్రదానం..

సాధారణంగా నదీస్నానాల్లో తర్పణం, పిండ ప్రదానం, శ్రాద్ధ కర్మలు చేసి పితృదేవతలను తృప్తి పరిచి వారి ఆశీస్సులు అందుకోవడం శుభప్రదమని విశ్వసిస్తారు. మొదటి రోజు హిరణ్య శ్రాద్ధం తొమ్మిదో రోజు అన్నశ్రాద్ధం , పన్నెండో ఆమ శ్రాద్ధం చేయడం మంచిదని పురాణాల్లో పేర్కొన్నారు. తండ్రి మరణానంతరం పుత్రులు శ్రాద్ధ కర్మలు చేయాలి.

పుష్కరం అంటే..

పుష్కరం అంటే పన్నెండు సంవత్సరాలు. ప్రతీ పన్నెండు సంవత్సరాలకు ఒక సారి భారతదేశంలోని 12 ముఖ్యమైన నదులన్నింటికి పుష్కరాలు వస్తాయి. పుష్కర సమయంలో ఆయానదులలో స్నానం చేస్తే ప్రత్యేక పుణ్యఫలం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. బృహస్పతి ఆయా రాశుల్లో ప్రవేశించినప్పుడు ఆయా నదికి పుష్కరాలు వస్తాయి. బృహస్పతి ఆ రాశిలో ఉన్నతం కాలం ఆ నది పుష్కరంలో ఉన్నట్టే. పుష్కర కాలంలోని మొదటి పన్నెండు రోజులు ఆది పుష్కరాలని, చివరి పన్నెండు రోజులను అంత్య పుష్కరమని వ్యవహరిస్తారు. ఈ మొదటి, చివరి పన్నెండు రోజులు మరింత ప్రత్యేకమైనవి.

పుష్కరకాల స్నానం..

నీటిలో రెండు శక్తులుంటాయని వేదం చెబుతోంది. దాహార్తి తీర్చడం, శుభ్రపరచడం అనే బాహ్య శక్తులైతే అంతరంగికంగా మేధ్యం, మార్జనం అనే శక్తులున్నాయని వేదం వివరిస్తోంది. మేధ్యం అంటే నదిలో స్నానం చేసి మూడుసార్లు మునక వేస్తే తెలిసి తెలియక చేసే పాపాలు పోతాయని, మార్జన అంటే నీటిని చల్లుకోవడం, అంటే సంప్రోక్షణ చేయడం. దీని వల్ల ద్రవ్య శుద్ధ జరుగుతుందని పురాణాలు తెలుపుతున్నాయి. నీరు నారాయణ స్వరూపం. అందుకే ఆయన స్పర్శతో పాపాలు తొలగుతాయని విశ్వాసం. తీర్థ, నదీస్నానాలు ఉత్తమం. దాని కన్నా పుష్కర స్నానం ఉత్తమోత్తమం. ఆ సమయంలో దేవతలంతా పుష్కరుడితో నదిలో ప్రవేశిస్తారని భక్తుల విశ్వాసం. పుష్కరకాలంలో స్నానమాచరిస్తే 12 సంవత్సరాల కాలం 12 నదుల్లో స్నానాలు చేసినంత పుణ్యం లభిస్తుందని పురాణాల్లో లిఖించబడింది.

నదికి వాయినాలు..

సుమంగళిగా జీవితాంతంగా ఉండాలని కోరుకుంటూ ఆడపడచులు పుష్కరాల సందర్భంగా నదీమాతల్లికి వాయినాలు సమర్పిస్తారు. ఇలా చేస్తే విఘ్నాలు తొలగి శుభాలు కలుగుతాయని విశ్వాసం. చీర, రవిక, గాజులు, పసుపు, కుంకుమ, పుస్తె, మెట్టెలను పూజించి నదిలోకి జారవిడుస్తారు. ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి ఆశీస్సులు తీసుకుంటారు.



పుష్కరాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సేవలు

- రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్



పుష్కరాల ఏర్పాట్లపై కలెక్టర్ రాహుల్ శర్మ, అధికారులకు సూచనలిస్తున్న అరవింద్ శర్మ

కాళేశ్వరం : కాళేశ్వరంలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న సరస్వతీనది పుష్కరాల్లో భక్తుల భద్రత, అత్యవసర సేవల నిమిత్తం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సేవలు వినియోగించనున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కాళేశ్వరంలోని వీఐపీ ఘాట్, సరస్వతీమాతా విగ్రహం, భక్తులు పుష్కర స్నానాలు చేసే త్రివేణి సంగమం, గోదావరి ఘాట్, దేవాలయం, బందోబస్తు ప్రణాళిక తదితర రక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు కాళేశ్వరంలో జాతీయ, రాష్ట్ర విపత్తులు దళ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎన్డీఆర్‌ఎఫ్ ఒక టీం (34 మంది), ఎస్‌డీఆర్‌ఎఫ్ రెండు టీంల (66 మంది) సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరం విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. పుష్కరాల సమయంలో ఏదైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు వెంటనే స్పందించి తక్షణమే సేవలు అందించేందుకు ఈ బలగాలను వివిధ ఘాట్‌ల వద్ద సిద్ధంగా ఉంచుతున్నట్లు తెలిపారు. భక్తులు భద్రతా నిబంధనలను పాటిస్తూ, అధికారుల సూచనల ప్రకారం పుష్కర స్నానాలు చేయాలని సూచించారు. భక్తులు ప్రమాద హెచ్చరికల సూచికలు దాటి నదిలోకి వెళ్లకుండా పటిష్ట పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పుష్కరాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మికి సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ సత్యనారాయణ, జిల్లా అగ్నిమాపక అధికారి కెవి. సతీశ్ కుమార్, తెలంగాణ రీజియన్ ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్,కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, దేవస్థానం ఈఓ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుంది

- గిరిజన ప్రాంతాల్లో అదనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- బయ్యారం, తులారాం ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మండలంలో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పక్కన ఎమ్మెల్యేలు కనకయ్య,మురళీనాయక్



బహిరంగ సభకు హాజరైన ప్రజలు

బయ్యారం: తెలంగాణలో కాంగ్రెస్ పాలిత ప్రజాప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సింహాపురం, రామచంద్రాపురం, కొమ్మవరం గ్రామాల్లో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులకు మంగళవారం లక్ష్మీనర్సింహాపురంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలపై రూపాయి భారం వేయకుండా వేల కోట్లతో పలు సంక్షేమ పథకాలు చేపడుతున్నామన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో లోఓల్టేజీ సమస్య ఉందని స్థానిక ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే బయ్యారం మండలంలో మూడు, టేకులపల్లి మండలంలో ఒక విద్యుత్‌సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ముందుకొచ్చామన్నారు. రానున్న రోజుల్లో ఇల్లందు నియోజకవర్గానికి మరో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున రూ.22, 500 వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, గిరిజన ప్రాంతంలో అదనంగా మరికొన్ని ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు

బయ్యారం పెద్ద చెరువు, తులారాం ప్రాజెక్టులపై దృష్టి..

మండలంలో ప్రధాన నీటివనరులైన బయ్యారం పెద్దచెరువు, తులారాం ప్రాజెక్టుల అభివృద్ధిపై దృష్టి సారిస్తానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయకట్టులోని భూములకు రెండు పంటలకు సాగు నీరు అందించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తన దృష్టికి తీసుకొచ్చారని, ఈ విషయంపై అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గంధంపల్లి–కొత్తపేటలో కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రునాయక్, ఇల్లందు, మహబూబాబాద్, వైరా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, డాక్టర్ మురళీనాయక్, రాందాస్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్, అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, ఆర్డీఓ కృష్ణవేణి, విద్యుత్‌శాఖ సీఈ రాజుచౌహాన్, ఎస్ఈ నరేశ్, డీఈ విజయ్, ఏఈ సుమన్, సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 రోజుల బాబుకు ఊపిరి పోశారు..

- హనుమకొండ జిల్లా కమలాపూర్ ఆస్పత్రి వైద్యుల ఘనత




9 రోజుల బాబుకు చికిత్స అందిస్తున్న వైద్యుడు, సిబ్బంది

కమలాపూర్: వైద్యో నారాయణ హరి.. వైద్యులు దేవుళ్లతో సమానమని అర్థం. తల్లిదండ్రులు జన్మనిస్తే వారు పునర్జన్మనిస్తారు. అలాంటి ఘటనే ఇది. ఊపిరాడక, కదలిక లేని 9 రోజుల బాబుకు వైద్యులు, సిబ్బంది ఊపిరి పోసి కాపాడారు. ఈ ఘటన మంగళవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. కమలాపూర్‌కు చెందిన రాపెల్లి సంధ్యారాణి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో 9 రోజుల క్రితం ప్రసవించి బాబుకు జన్మనిచ్చింది. అవగాహనారాహిత్యంతో బాబుకు సబ్బుతో స్నానం చేయించడంతో ముక్కులోకి సబ్బు నీళ్లు వెళ్లి ఊపిరాడక, కదలిక లేకుండా పోయింది. కంగారుపడిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా డాక్టర్ వరుణ్ మాధవ్ ఆధ్వర్యంలో నర్సింగ్ ఆఫీసర్లు స్వప్న, అనిత, కల్యాణి కలిసి బాబు ముక్కులో పైపు వేసి ఆస్పిరేషన్ ద్వారా సబ్బు నీళ్లు బయటకు తీయడంతో బాబులో కదలిక వచ్చి ఒక్కసారిగా ఏడవటం ప్రారంభించాడు. అనంతరం బాబుకు పిల్లల వైద్యుడితో మెరుగైన వైద్యం ఇప్పించాలని సూచించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. దీంతో సదరు కుటుంబీకులు బాబుకు ఊపిరి పోసిన వైద్యుడు, నర్సింగ్ ఆఫీసర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటినుంచి కేయూ డిగ్రీ పరీక్షలు

- పరీక్షలు రాయనున్న 2,01,238 మంది విద్యార్థులు
- 118 కేంద్రాలు ఏర్పాటు
- 125మంది అబ్జర్వర్లు, 10 మంది ఫ్లయింగ్‌స్క్వాడ్‌ల నియామకం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీ ఒకేషనల్ తదితర కోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు, అలాగే బ్యాక్‌లాగ్ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షలు నేటి నుంచి (ఈనెల 14నుంచి) నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ మంగళవారం తెలిపారు. ఆయా సెమిస్టర్ల పరీక్షల నిర్వహణకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 46, ఖమ్మం జిల్లాలో 25, ఆదిలాబాద్ జిల్లాలో 47.. మొత్తం 118 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 118 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 125 మంది అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. ఆయా సెమిస్టర్ల పరీక్షలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 79,224మంది విద్యార్థులు, ఖమ్మం జిల్లాలో44,793 మంది, ఆదిలాబాద్ జిల్లాలో 77,221మంది.. మొత్తం 2,01,238 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు 10 మంది ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. టైంటేబుల్ ప్రకారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను సంబంధిత కేయూ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కాగా, పరీక్షల నిర్వహణకు నిర్దేశించిన సమయానికి ముందే ఆయా కేంద్రాలకు ఆన్‌లైన్‌లోనే ప్రశ్నాపత్రాలు పంపిస్తారు. డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు అందజేయాల్సింటుంది.

ప్లస్ టు ఫలితాల్లో 'ఎస్‌ఆర్' విజయకేతనం



జి. సాయిహర్షిణి ఆర్. స్వస్తికా సీహెచ్. అన్సికా అంజనా సంతోషి

విద్యారణ్యపురి: ప్లస్ టు (సీబీఎస్ఈ ఇంటర్) పరీక్షల ఫలితాల్లో 'ఎస్‌ఆర్' విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని 'ఎస్‌ఆర్' విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి, మధుకర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి తెలిపారు. జి. సాయిహర్షిణి 500 మార్కులకు 480 మార్కులు సాధించారు. ఆర్. స్వస్తికా 478 మార్కులు, సీహెచ్. అన్సికా 477 మార్కులతో జాతీయ స్థాయిలో 'ఎస్‌ఆర్' కీర్తి ప్రతిష్ట నిలిపారని తెలిపారు. అలాగే, కె. అంజనాసంతోషి 475 మార్కులు, ఎ. అమూల్య 472 మార్కులు, వి.ప్రత్యూష్నారెడ్డి 470 మార్కులు సాధించారని వారు తెలిపారు. భవిష్యత్తులో మరింత అత్యుత్తమ మార్కులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో విజయభేరి..



ఎం. రిషి వి. వివేకానందారెడ్డి కె. జశ్వంత్ బి. హృశికేశ్‌మూర్తి ఎ.సాయికశ్యప్

విద్యారణ్యపురి: సీబీఎస్ఈ టెన్త్ పరీక్షల ఫలితాల్లో 'ఎస్‌ఆర్' స్కూల్స్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారని 'ఎస్‌ఆర్' విద్యాసంస్థల చెర్మన్ ఎ. వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. జాతీయ స్థాయిలో ఎం. రిషి 500 మార్కులకుగాను 498 మార్కులు సాధించారని వారు పేర్కొన్నారు. వి. వివేకానందారెడ్డి 487 మార్కులు, కె జశ్వంత్ 487 మార్కులు, బి హృశికేశ్‌మూర్తికి 485 మార్కులు, ఎ. సాయి కశ్యప్ 484 మార్కులు, పి.అభిలాశ్‌రెడ్డి 481మార్కులు, కెకె.సాహిత్య 480మార్కులు సాధించారని తెలిపారు. పటిష్ట విద్యాప్రణాళిక, అంకితభావం కలిగిన ఉపాధ్యాయ బృంద విద్యాబోధనతో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని వారు చెప్పారు. ఎస్ఎస్‌సీ విద్యార్థులకు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌పై శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ ఫలితాలు విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకం కావాలని వారు ఆకాంక్షించారు.

ఏకశిల విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ తిరుపతిరెడ్డి

హసన్‌పర్తి: సీబీఎస్ఈ టెన్త్ పరీక్షల ఫలితాల్లో ఏకశిల పాఠశాల హవా సాగింది. పాఠశాలకు చెందిన హాసిని 487 మార్కులు, ఎల్. సౌమిత 486 మార్కులు, సాయి పార్థిక్ 483 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈసందర్భంగా మంగళవారం పాఠశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈకార్యక్రమానికి ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనందించడమే తమ ధ్యేయమని చెప్పారు. కార్యక్రమంలో ఏకశిల విద్యా సంస్థల డైరెక్టర్లు కొండల్‌రెడ్డి, గౌరు సువిజారెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, గౌరు రిత్విక్‌రెడ్డి, దినేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'సెంట్రల్' టెన్త్‌లో సత్తాచాటిన 'తేజస్వి'



జ్ఞానతేజారెడ్డి జి.ఉదయ్ నిక్షిత్ ఎల్.శ్రీవిద్య ఎస్.నందిత బి.అగర్వాల్



బి.శ్రీకృష్ణ కౌశిక్ మేధసునైన రీతుల్ కె.మీనాక్షి

నయింనగర్: సీబీఎస్ఈ -2025 టెన్త్ ఫలితాల్లో తేజస్వి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ మార్కులు సాధించి ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజయదుందుభి మోగించారు. సిద్ధామూర్తి జ్ఞానతేజారెడ్డి 487 మార్కులు, గంజి ఉదయ్ నిక్షిత్, లడే శ్రీవిద్య 481 , ఎస్.నందిత 479, భవ్యాంశ్ అగర్వాల్ 476, భుక్యా శ్రీ కృష్ణ కౌశిక్ 473, ఎం. సునైన రీతుల్ 472 , కె.మీనాక్షి 471 మార్కులు సాధించారు. హంటర్‌రోడ్, ఎర్రగట్టు గుట్ట బ్రాంచ్‌లలో విద్యార్థులు అధిక మార్కులు సాధించారు. పాఠశాల గత చరిత్రను ఎప్పటిలాగే కొనసాగిస్తూ ఉత్తమ స్థానం నిలబెట్టుకుంది. ఈ విజయపరంపర కొనసాగించిన విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, తల్లి దండ్రులకు విద్యాసంస్థల చైర్మన్ రేవూరి జైపాల్‌రెడ్డి, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్ అభినందనలు తెలిపారు.